సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 11 । నవంబర్ । 2022



దైవ మార్గంలో నడుచుకోవాలి

సీలేరు: ప్రతి ఒక్కరు దైవమార్గంలో నడుచుకోవాలని టీటీడీ గాయని కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. హిందుధర్మప్రచారంలో భాగంగా గురువారం ఆమె సీలేరులో పర్యటించారు.



డీపట్టా భూములకు త్వరలోనే పరిహారం

పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ఆదిత్య 8లో

కూల్..కూల్..



జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చింతపల్లిలో నిన్నటి కన్నా కాస్త పెరిగాయి చింతపల్లిలో 17 డిగ్రీలు నమోదు

మినుములూరు	:	13 డిగ్రీలు
అరకులోయ	:	13.9
చింతపల్లి	:	17 డిగ్రీలు

న్యూస్‌రీల్

సమస్యలుంటే తెలియజేయండి

చింతూరు ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్ ఖాన్

కూనవరం: ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఎప్పటి కప్పుడు తనదృష్టికి తేవాలని చింతూరు ఐటీడీఏ పీఓ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. గురువారం ఆయన కోతులగుట్టలోని సీహెచ్‌సీని సందర్శించారు.రికార్డులు పరిశీలించారు. ల్యాబ్, డెంటల్, ప్రసూతి కేంద్రాలను పరిశీలించారు. ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ చిన్నపిల్లల వార్డు, ఎక్స్‌రే యూనిట్, ఆపరేషన్ థియేటర్ గదులను, ఎన్ఆర్‌సీ వార్డులను పరిశీలించారు. చిన్న పిల్లలకు అందుతున్న వైద్య సేవలను అడిగితెలుసుకున్నారు. ఆస్పత్రిలో వైద్యుల వివరాలు, ఖాళీలు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ వినీత నుంచి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుభాష్, చిన్నపిల్లల వైద్యులు వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

'బొర్రా' నిధుల విడుదలకు వినతి



యూనిట్ మేనేజర్ గౌరీశంకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు వచ్చే ఆదాయంలోని పంచాయతీకి అభివృద్ధికి రావాల్సిన 20శాతం నిధులు విడుదలకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అప్పారావు, స్థానికులు కోరారు. ఈమేరకు గురువారం వారు బొర్రా గుహల వద్ద మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2007లో పంచాయతీ అభివృద్ధికి 20శాతం ఇచ్చేలా అప్పటి ప్రభుత్వం పర్యాటకశాఖకు జీవో జారీ చేసిందన్నారు. ఈ మేరకు నిధులు విడుదల చేయడమే కాకుండా గైడ్లు, సెక్యూరిటీ గార్డులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఇప్పటివరకు బొర్రా పంచాయతీకి ఇప్పటివరకు రూ.8 కోట్లు రావాల్సి ఉందన్నారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే వచ్చే నెల 9 నుంచి ఆందోళనకు దిగుతామని తెలిపారు. ఈ మేరకు పీసా, గ్రామ పంచాయతీలు తీర్మానం చేశాయని వివరించారు.

సమర్థవంతంగా ప్రీస్కూల్ నిర్వహణ

సీడీపీవో సంధ్యారాణి



గర్భిణులతో మాట్లాడుతున్న సీడీపీవో సంధ్యారాణి

రంపచోడవరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త ప్రవేశపెట్టిన ప్రీస్కూల్ విద్యా విధానం సమర్థవంతంగా అమలుచేయాలని రంపచోడవరం సీడీపీవో సంధ్యారాణి సూచించారు. గురువారం ఆమె మండలంలోని కోరుమిల్లి, చిన కోరుమిల్లి, గోగుమిల్లి అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ప్రీస్కూల్ బోధనకు అనువుగా పిల్లల కోసం పంపిణీ చేసిన కిట్లను వినియోగించకుండా వదిలేయడంతో అంగన్‌వాడీ కార్యకర్తలను మందలించారు. ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రక్తహీనతతో బాధపడుతున్న హైరిస్క్ గర్భిణులను ఆమె కలిసి పలు సూచనలు చేశారు. ప్రసవానికి వారం రోజులు ముందుగా బర్త్ వెయింటింగ్ హాల్‌కు రావాలని ఆమె సూచించారు.

సిరులు వరించేలా..

జిల్లాలో ఈ ఏడాది వరి సాగు గిరి రైతుకు సిరులు కురిపించనుంది. మన్యంలో అధిక వర్షపాతం నమోదైనప్పటికీ అడపాదడపా కురవడం వల్ల అన్నదాతకు మేలు చేసింది. పెట్టుబడికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా వైఎస్సార్ రైతు భరోసా ఆదుకుంది. పంటకాలంలో సమృద్ధిగా నీరు అందుబాటులో ఉంది. తెగుళ్ల ప్రభావం కూడా పెద్దగా లేనందున ఊహించిన దానికన్నా దిగుబడులు రావచ్చని గిరి రైతులు ఆశిస్తున్నారు. ఈ నెల 15 నుంచి ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.



సాగు వివరాలు

సాగు విస్తీర్ణం	:	58,326 హెకార్లు
దిగుబడి అంచనా	:	1.56 లక్షల టన్నులు
ధాన్యం కొనుగోలు	:	ఈనెల 15 నుంచి
కేంద్రాలు	:	56
కొనుగోలు లక్ష్యం	:	25 లక్షల మెట్రిక్ టన్నులు
మద్దతు ధర	:	రూ.2060 (వంద కిలోలు)
సాధారణ రకం	:	రూ.2040 (వంద కిలోలు), రూ.1530 (75 కిలోలు)
గ్రేడ్ ఏ రకం	:	రూ.2060 (వంద కిలోలు), రూ.రూ.1545 (75 కిలోలు)

- ఆశాజనకంగా వరి సాగు
- సమృద్ధిగా వర్షాలు
- పెట్టుబడికి ఆదుకున్న రైతు భరోసా
- తగ్గిన తెగుళ్ల బెడద
- పెరగనున్న దిగుబడులు
- ధాన్యం కొనుగోలుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు

రాజవొమ్మంగి: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 58,326 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున 1.56 లక్షల టన్నుల దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. 57,243 హెక్టార్లకు చెందిన రైతులు మాత్రమే ఈ క్రాప్ నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం పైరు గింజ పాలుపోసుకునే దశలో ఉంది. మరో వారం పది రోజుల్లో పంట కోతకు సిద్ధమవుతుందని రైతులు తెలిపారు.

దేవీపట్నంలో ముందస్తుగా వరికోతలు..

జిల్లాలో గోదావరి నీరు అందుబాటులో ఉన్న దేవీపట్నం మండలంలో మాత్రం వరి కోతలు ముందుగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. గిరి రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 15 నుంచి సేకరణ ప్రారంభిస్తామని ఇప్పటికే కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 56 కొనుగోలు కేంద్రాలను రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 46 కేంద్రాలను రంపచోడవరం డివిజన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ముందస్తుగా పంట కోతకు ముందుగా వచ్చే దేవీపట్నం, గంగవరం మండలాల్లో ఏర్పాటు చేస్తున్నట్టు పౌరసరఫరాలశాఖ డీఎం గణేష్‌కుమార్ తెలిపారు.

మద్దతు ధర నిర్ణయంతో..

ఈ ఏడాది రైతుల నుంచి 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్న లక్ష్యంతో జిల్లా అధికార యంత్రాంగం ఉంది. ప్రభుత్వం ధాన్యం మద్దతు ధరను ప్రకటించింది. వంద కిలోలు సాధారణ రకం రూ.2040, 75 కిలోలు రూ.1530, గ్రేడ్ ఏ రకం ధాన్యం వంద కిలోలు రూ.2060, 75 కిలోలు రూ.1545 చొప్పున ధర చెల్లిస్తారు. జిల్లాలో అధిక విస్తీర్ణంలో హుకుంపేట మండలంలో 14,969 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. అరకులోయలో 9,663, పెదబయలులో 11,673, జి.మాడుగులలో 8,939, చింతూరులో 10,633,డుంబ్రిగుడలో 9659, పాడేరు మండలంలో 9278 ఎకరాల్లో సాగు చేపట్టినట్టు అధికారవర్గాలు తెలిపాయి.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

ధాన్యం విక్రయాల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి. రాళ్లు, మట్టి, చెత్త, తాలు గింజలు తదితర వ్యర్థాలు లేకుండా చూడాలి. చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని తీసుకురాకూడదు. పూర్తి పక్వానికి వచ్చిన పంటను కోసి ధాన్యం తేమ లేకుండా ఆరబెట్టి తీసుకురావాలి. తేమ లేక నిమ్ము శాతం 17కు మించి ఉండకూడదు.

–గణేష్ కుమార్, డీఎం, పౌరసరఫరాల శాఖ, పాడేరు

ముస్తాబైన విశాఖ



విద్యుత్ వెలుగుల్లో కాన్వెంట్ జంక్షన్‌లోని అంబేద్కర్ సర్కిల్

- ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు
- సుందరంగా రహదారులు
- ఆకట్టుకునేలా పెయింటింగ్స్
- ప్రధాని, సీఎం చిత్రాలతో స్వాగత హోర్డింగ్‌లు

దొండపర్తి(విశాఖ దక్షిణ): ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా నగరం సుందరంగా ముస్తాబైంది. విమానాశ్రయం నుంచి ప్రధాని, సీఎం ప్రయాణించే రహదారులు కొత్త హంగులు అద్దుకున్నాయి. రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం ప్రధాని మోదీ, గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్, సీఎం జగన్ విశాఖకు రానున్నారు. ఈ నెల 12న ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభలో వీరు పాల్గొనున్నారు. వీరితో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ప్రధాని చేతుల మీదుగా 9 అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 3 లక్షల మంది సభకు హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. విజయవంతంగా సభ జరిగేలా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి.

వర్షం పడినా ఇబ్బంది లేకుండా..

మూడేళ్ల తర్వాత విశాఖకు వస్తున్న ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అల్పపీడనం కారణంగా రానున్న రెండు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని సభకు వర్షం ఆటంకం కలగకుండా ఉండే విధంగా ఏయూ మైదానంలో వేదిక ఏర్పాట్లు చేశారు. వేదికతో పాటు ప్రజలు కూర్చొనే సభా ప్రాంగణం మొత్తాన్ని వాటర్ ప్రూఫ్ టెంట్లు వేశారు. భారీ సంఖ్యలో వచ్చే ప్రజల కోసం సభా ప్రాంగణంలోనే మంచి నీటి సదుపాయాలు కల్పించనున్నారు.

రహదారులకు హంగులు

విశాఖ విమానాశ్రయం నుంచి ప్రధాని పర్యటించే రహదారులను అధికారులు సుందరంగా ముస్తాబు చేశారు. నగరానికి వస్తున్న ప్రముఖులను ఆకట్టుకునేలా పచ్చదనంతో కళకళలాడుతున్న రహదారుల్లో వివిధ ఆకృతులు, పలు థీమ్‌లతో ఖాళీ గోడలకు పెయింటింగ్స్, డివైడర్లు, ట్రాఫిక్ ఐలాండ్స్‌కు రంగు వేయించారు.



కాన్వెంట్ జంక్షన్ నుంచి ప్రధాని పర్యటించే మార్గంలో సుందరీకరణ పనులు

నిఘా నీడలో నగరం

ప్రధాని మోదీ పర్యటనతో నగరం సందడిగా మారింది. ఒకవైపు అధికారులు పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమై ఉంటే.. మరోవైపు పోలీసులు నగరాన్ని జల్లెడపడుతున్నారు. 6,700 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, భద్రతా దళాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే నగరంలోని అన్ని హోటళ్లు, రిసార్టులు, లాడ్జిలు, అతిథి గృహాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. సభ జరిగే ఏయూ పరిసర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బాంబ్, స్నిఫర్ డాగ్ బృందాలు అణువణువూ గాలిస్తున్నాయి. నగరంలో అన్ని వైపులా పికెటింగ్, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. ప్రధాని పర్యటన సజావుగా ముగిసే విధంగా అన్ని భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. 8 మంది ఐఏఎస్ అధికారులు, 20 మంది డిప్యూటీ కలెక్టర్లు, 50 మంది జిల్లా స్థాయి అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

అడుగడుగునా స్వాగత హోర్డింగ్‌లు

2019 మార్చి 1న తర్వాత విశాఖకు వస్తున్న ప్రధానికి ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. ఐఎన్ఎస్ డేగా నుంచి ప్రధాని రాత్రి బస చేయడానికి వెళ్లే ఐఎన్ఎస్ చోళా మార్గం, అక్కడ నుంచి ఏయూకు వచ్చే దారిలో అధికారులు భారీ స్వాగత హోర్డింగ్‌లు, కటౌట్లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. సభ ప్రాంగణం మొత్తం పీఎం మోదీ, సీఎం జగన్ ఫొటోలతో కూడిన కటౌట్లు పెట్టారు.

గిరిజనుల శ్రమకు దక్కిన ఫలితం

- గిరి శిఖర గ్రామాలను సందర్శించిన ఎంపీడీవో శ్రీహర్షిత్
- కాలినడకన వెళ్లి శ్రమదానం పనుల పరిశీలన
- రోడ్డు పనులకు రూ.20 లక్షల మంజూరు

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీహర్షిత్

అనంతగిరి: మండలంలోని పినకోట పంచాయతీ గిరి శిఖర గ్రామాలైన గుమ్మంతి నుంచి రాచకీలం గ్రామానికి శ్రమదానంతో చేపట్టిన రహదారి నిర్మాణానికి ఉపాధి నిధులు మంజూరు చేసినట్టు ఎంపీడీవో శ్రీహర్షిత్ తెలిపారు. రాచకీలం, రెడ్డిపాడు గిరి శిఖర గ్రామాల గిరిజనులు శ్రమదానంతో నిర్మిస్తున్న రహదారిపై 'కొండను తవ్వి.. బండ రాళ్లను నెట్టి..' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ గణేష్, ఏన్ఆర్‌జీఎస్ ఈసీ పవన్, పినకోట సర్పంచ్ గణేష్‌తో కలిసి రాచకీలం గ్రామానికి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లారు. వారికి గిరిజన సంప్రదాయంలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో గుమ్మంతి నుంచి రాచకీలం వరకు రాచకీలం నుంచి రెడ్డిపాడు వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డుకు రూ.20 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. వీరు 7520 పనిదినాల మేర ఉపాధి నిధులు పొందవచ్చునన్నారు. బల్లగరువు నుంచి దాయర్తీ వరకు రహదారి నిర్మాణానికి సుమారు రూ.20 లక్షలు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించలేదని ఎంపీడీవోకు సీపీఎం నాయకుడు గోవిందరావు విన్నవించారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు.వైఎస్సార్‌సీపీ నాయకుడు రాంబాబు, ఏన్ఆర్ఈజీఎస్ సిబ్బంది మంగ, శోభన్‌బాబు, లక్ష్మి పాల్గొన్నారు.

బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించండి: డీఆర్వో



మాట్లాడుతున్న డీఆర్వో దయానిధి

సాక్షి,పాడేరు: అన్ని రాజకీయ పార్టీలు బూత్‌లెవెల్ ఏజెంట్లను నియమించాలని,జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అరకులోయలోని కంఠభంసగుడ 106 పోలింగ్ బూత్‌లో అదనంగా మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి 1065 ఓటర్లను కలిపారు. అలాగే పాడేరు మండలం సుండ్రుపుట్టులోని 109ఏ బూత్‌ను ఏర్పాటు చేశారు. దీనికి 805మంది ఓటర్లను కలుపుతూ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సుండ్రుపుట్టులో పోలింగ్ బూత్ గది, రాజేంద్రపాలెం పేరుతో ఉన్న 117 పోలింగ్ బూత్‌ను కొయ్యూరు పేరిట మార్పునకు తీర్మానించారు. డీఆర్వో మాట్లాడుతూ ఈనెల 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఉంటుందని, వచ్చేనెల 9వతేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. వచ్చేనెల 25నాటికి పరిష్కరించి, 30న తుదిజాబితా విడుదల చేస్తామని తెలిపారు. తహసీల్దార్ వి.త్రినాథరావు నాయుడు, పర్యవేక్షకులు నాగజ్యోతి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలభారత రైతుకూలీలు

వై.రామవరం: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలని అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గుమ్మరిపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు గిరిజనులంతా హక్కుల సాధనకు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 15వ తేదీ బిర్సాముండా జయంతిని నిర్వహించాలని కోరారు. సంఘ ప్రతినిధులు పి.పాపన్న, సూండ్రు కాసులమ్మ, బాలమ్మ, రామలింగేశ్వరి, బాబురావు, అమ్మోజి పాల్గొన్నారు.

పోచవరం టూ పాపికొండలు ..



పోచవరం బోట్ పాయింట్ నుంచి పాపికొండల పర్యాటకానికి వెళ్తున్న సందర్శకులు

- బోట్ పాయింట్ నుంచి విహారయాత్ర ప్రారంభం
- బయలుదేరి వెళ్లిన 97 మంది సందర్శకులు

-8లో

గిరిలో వికసించిన క్రీడాకుసుమాలు



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది



ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం ఝాన్సీహేన్సన్, పీడీ, పీఈటీ తదితరులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మణికంఠ

జి.మాడుగుల: షటిల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలకు స్థానిక గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థి రీమెలి మణికంఠ ఎంపికయ్యాడు. స్థానిక ఏపీఆర్ బాలుర కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మణికంఠ ఈ నెల 8న విశాఖ బుల్లయ్య కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచాడు. యువకుడిని ప్రిన్సిపాల్ పారయ్య, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణారావు, పీడీ దున్ను, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీలకు గురుకుల విద్యార్థి

చింతపల్లి రూరల్: జిల్లాస్థాయిలో నిర్వహించిన షాట్‌పుట్ పోటీల్లో స్థానిక గురుకుల కళాశాల విద్యార్థి సామ్యూల్ ప్రతిభ కనబరిచాడు. జిల్లా తరపున రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ కె.వి.రామేశ్వరం తెలిపారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని ఆయన వివరించారు.

గంగవరం విద్యార్థినులు..

గంగవరం: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమబాలికోన్నత పాఠశాలకు చెందిన 16మంది బాలికలు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని ఝాన్సీహేన్సన్ తెలిపారు. ఈ నెల 7న రంపచోడవరంలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాఠశాలకు చెందిన 16 మంది కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, టెన్నీక్వాయిట్, యోగాలో ప్రతిభ కనబరిచారన్నారు. ఈ సందర్భంగా వారితోపాటు పీడీ నాగమణి, పీఈటీ పద్మావతిని ఆమె అభినందించారు.

అటవీ అమరవీరుల త్యాగాలు నిరుపమానం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న పీవో గోపాలకృష్ణ, డీఎఫ్‌వో వినోద్‌కుమార్



రక్తదానం చేస్తున్న అటవీ ఉద్యోగులు



గుడిసె గ్రాస్ ల్యాండ్‌లో సేకరించిన చెత్తతో అటవీ అధికారులు, సిబ్బంది

సాక్షి,పాడేరు: అటవీశాఖలోని విధి నిర్వహణలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు నిరుపమానమని పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. పాడేరు అటవీశాఖ డివిజన్ కార్యాలయం ఆవరణలో గురువారం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అటవీ అమరవీరుల స్థూపం వద్ద ఆయనతోపాటు డీఎఫ్‌వో వినోద్‌కుమార్, ఇతర అటవీశాఖ అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పీవో మాట్లాడుతూ అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణ లక్ష్యంగా అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. స్థానిక రెడ్ క్రాస్ సొసైటీలో ఏర్పాటుచేసిన అటవీశాఖ ఉద్యోగుల రక్తదాన శిబిరాన్ని ఐటీడీఏ పీవో ప్రారంభించారు. రక్తదానం చేసిన పదిమంది అటవీ ఉద్యోగులను వారు అభినందించారు అభినందించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ అధికారులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఈశ్వరరావు, అప్పారావు, గౌరీశంకర్, సూర్యారావు పాల్గొన్నారు.

గుడిసె కొండల్లో..

రంపచోడవరం: గుడిసె గ్రాస్ ల్యాండ్‌లో అటవీశాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. రంపచోడవరం సబ్ డివిజన్‌లోని 121 మంది అటవీ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రంపచోడవరం సబ్ డీఎఫ్‌వో భరణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అటవీ అమరులకు నివాళులర్పించారు.

గుడిసె గ్రాస్‌ల్యాండ్ పరిరక్షణ కోసం..

ఎంతో అరుదైన గుడిసె గ్రాస్ ల్యాండ్ (గడ్డి భూములు) సంరక్షణ కోసం రంపచోడవరం డీఎఫ్‌వో నరేంధిరన్ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా నాలుగు నెలల నుంచి గుడిసెకు పర్యాటకుల రాకను నిలిపివేశారు. గురువారం అటవీ అధికారులు, సిబ్బంది గుడిసె గ్రాస్ ల్యాండ్‌లో పర్యాటకులు వదిలిపెట్టిన సీసాలు, ప్లాస్టిక్ కవర్లను సేకరించారు. ఉదయం పది గంటలకు చేరుకున్న అటవీ అధికారులు, సిబ్బంది రెండు గంటలపాటు శ్రమించారు.పుల్లంగి, గుడిసె గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు. గుడిసె కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం కమిటీ ఏర్పాటుకు అటవీశాఖ కసరత్తు చేపట్టింది. దీని ద్వారా గుడిసె పర్యాటకాన్ని గిరిజనులే నిర్వహించుకుంటారు.



చింతపల్లిలో అటవీశాఖ అధికారుల ర్యాలీ

చింతపల్లి: అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా డీఎఫ్‌వో సూర్యనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అటవీశాఖ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయి అటవీ అమర వీరులకు నివాళి అర్పించారు. రేంజ్ అధికారులు పాత్రుడు, శ్రీనివాసరావు, వర్మ, సీఐ రమేష్, ఎస్ఐ షారిప్ అలీ పాల్గొన్నారు.

డీపట్టా భూములకు త్వరలోనే పరిహారం

దేవీపట్నం: డీపట్టా భూములకు లబ్ధిదారులకు త్వరలోనే నష్టపరిహారం అందుతుందని పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. పెదభీంపల్లి -2ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలన్నీ పరిష్కారం అయ్యేలా చూస్తానని ఆయన పేర్కొన్నారు. అలాగే కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్, ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి కాకపోవడంపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ శుభం భన్సాల్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

పలు చోట్ల రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు


చుంచుంపూడిలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ అనూషదేవి

గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టింది. సచివాలయాల వారీగా కేటాయిస్తున్న నిధులతో పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణపనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. రోడ్ల నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల గిరిజనులకు రవాణా కష్టాలు తీరుతాయి.

జి.మాడుగుల: పెదలువ్వాసింగి పంచాయతీ చుట్టుగుమ్మిలో రూ.12లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, సర్పంచ్ కె.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జి.పండుదొర, తల్లే చిట్టిబాబు, వార్డు సభ్యుడు చినకొండబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సూర్యప్రకాష్,నీలకంఠం తదితరలు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని చింతలపూడి పంచాయతీ పరిధిలోని చింతకొయ్యి గ్రామ రోడ్డు నిర్మాణానికి గురువారం స్థానిక మండల ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి,సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ, ఉప సర్పంచ్ పల్లాల లచ్చిరెడ్డి, జేఈ రవితేజ తదితరులు పాల్గొన్నారు.


మంచంరాయిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సీతమ్మ

గూడెంకొత్తవీధి: గ్రామాల్లో రహదారుల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని గూడెంకొత్తవీధి ఎంపీపీ బోయిన కుమారి తెలిపారు. సంకాడ పంచాయతీ కొత్తూరు నుంచి గండంపల్లి వరకూ రూ.45లక్షల వ్యయంతో నిర్మించనున్న తారురోడ్డు పనులను ఆమె స్థానిక సర్పంచ్ నాగులమ్మతో కలసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నిధులను కేటాయిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, దావనాపల్లి పంచాయతీ సర్పంచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


చింతకొయ్యిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

చింతపల్లి: మండలంలోని చింతపల్లి పంచాయతీ చుంచుంపూడిలో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను గురువారం ఎంపీపీ కొరాబు అనూషదేవి ప్రారంభించారు. రూ.4 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ పనులు పూర్తయితే గిరిజనుల రవాణా కష్టాలు తీరుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూరియా పుష్పలత,ఎంపీటీసీలు దారలక్ష్మి,జయలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యుడు నాజర్ వలీ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అరిసెల సీతమ్మ అన్నారు. మండలంలోని జర్రెల పంచాయతీ మంచంరాయి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి గురువారం ఎంపీపీ సీతమ్మ,సర్పంచ్ భాగ్యవతి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ గిరిజన సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నేత సురేష్ తదితరులు పాల్గొన్నారు.


చుట్టుగుమ్మిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సన్యాసిదొర, సర్పంచ్ సత్యనారాయణ


తారురోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ బోయిన కుమారి, పంచాయతీ సర్పంచి నాగులమ్మ

బిర్సా ముండా జయంతి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ జేఏసీ నేతలు

సాక్షి,పాడేరు: బిర్సాముండా 148వ జయంతి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర కోరారు. ఈనెల 13న నిర్వహించనున్న జయంతి ఉత్సవాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను గురువారం స్థానిక జీఎస్‌యూ భవనం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరులో నిర్వహించే ఉత్సవానికి పలు యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు కె.అనిల్ కుమార్, డాక్టర్ ఎం.కిషన్, డాక్టర్ బి.కె. శ్రీనివాస్, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ తమర్బ బాబూరావునాయుడులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సుమన్,ప్రధాన కార్యదర్శి బూడిదె మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పోచవరం టూ పాపికొండలు..

వీఆర్‌పురం: పోచవరం బోట్ పాయింట్ నుంచి గురువారం పాపికొండల పర్యాటకం ప్రారంభమైంది. ఈ నెల 8వ తేదీన బోటింగ్‌కు అనుమతులు రావడంతో స్థానిక అధికారులు ట్రయిల్‌వరన్ నిర్వహించి విహారయాత్ర ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేయడం తెలిసిందే. గురువారం ఉదయం మయూరి-1 బోట్ 42 మంది, సాయి శ్రీనివాస బోట్ 55 మందితో పాపికొండల విహారయాత్రకు బయలుదేరి వెళ్లాయి. ఎటపాక సీఐ గజేంద్ర బోట్ పాయింట్ వద్ద పరిస్థితిని పర్యవేక్షించి బోట్ యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. వరదల కారణంగా సుమారు ఐదు నెలలుగా నిలిచిపోయిన పర్యాటకం తిరిగి అధికారికంగా ప్రారంభం కావడంతో ఇటు బోట్ యాజమాన్యం, సిబ్బంది, పర్యాటకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాల్లో ఆనందం నెలకొంది.

మరో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

రాజవొమ్మంగి: మండలంలో కొత్తగా మరో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్టు సొసైటీ సీఈవో జాలెం గోపాలకృష్ణ గురువారం తెలిపారు. శరభవరం, లబ్బర్తి, దూసరపాము గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితో పాటు రాజవొమ్మంగి, జడ్డంగి, కొమరాపురాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. రాజవొమ్మంగి మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 6,200 ఎకరాల్లో వరి సాగుచేసినట్టు చెప్పారు. గత ఏడాది 4,120 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఆరు కేంద్రాలకు ఆరుగురు టెక్నికల్ అసిస్టెంట్లను నియమించినట్టు చెప్పారు. ధాన్యం కొనుగోలులో సహకరిస్తున్న వలంటీర్లకు నెలకు రూ.1,500 చొప్పున పారితోషికం అందజేస్తామన్నారు.

పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు

సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఎటపాక: మండలంలో పోలవరం నిర్వాసితుల కోసం నిర్మిస్తున్న పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. గురువారం ఆయన కన్నాయిగూడెం, కాపవరం, రాయనపేట, నర్సింగపేట, ఎర్రబోరు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. కన్నాయిగూడెంలో కొంత మంది తమ సమస్యలను సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నీటి సౌకర్యం కల్పించాలని, ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ఇక్కడే రేషన్, పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని, శ్మశాన వాటికలకు స్థలం సమకూర్చాలని కోరారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ తక్షణ చర్యలు చేపట్టాలని మండల అధికారులను ఆదేశించారు. అనంతరం నెల్లిపాక పీహెచ్‌సీని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్,ఎంపీడీవో విఠల్‌పాల్, పీఆర్ ఏఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


పునరావాస కాలనీలో నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్

పోలీసు సేవలు సద్వినియోగం చేసుకోండి


విద్యార్థులకు అవగహన కల్పిస్తున్న సీఐ జి.డి.బాబు

అరకులోయ రూరల్: పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని అరకులోయ సీఐ జి.డి.బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మీ కోసం మీ పోలీసు కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. మత్తుదార్థాలకు బానిసలై బంగారు జీవితాలను పాడుచేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమీల,ఎస్ఐ కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా...తెలంగాణ వాసి మృతి


ఘటనలో మృతిచెందిన శ్రీను


బోల్తా పడిన వ్యాన్

చింతూరు: మండలంలోని గంగన్నమెట్ట వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుఝామున బొలేరో వాహనం బోల్తా పడిన ఘటనలో తెలంగాణకు చెందిన కోడి శ్రీను (27) అనే వ్యక్తి మృతి చెందాడు. బొలెరో వాహనం దుమ్ముగూడెం నుంచి చింతూరు వైపు వస్తున్న క్రమంలో గంగన్నమెట్ట వద్దకు రాగానే టైరు పగిలిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వాహనం వెనకభాగంలో కూర్చున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం కాటాయిగూడెంకు చెందిన శ్రీను కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతనిని చికిత్స నిమిత్తం చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనలో వ్యానులో వున్న రవికిరణ్, వరుణ్, గోపాల్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ యాదగిరి తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


రఘువర్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

హుకుంపేట: గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ పి.రఘువర్మ తెలిపారు. బాకురు,హుకుంపేట, సూకురు, అల్లంపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సెల్ సిగ్నల్స్ సరిగా ఉండవని, అందువల్ల యాప్‌ల ద్వారా హాజరు విధానాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని కోరుతానని హామీ ఇచ్చారు. స్థానిక ఇంగ్లిష్ మీడి యం పాఠశాల వద్ద ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎమ్మెల్సీ అభ్యర్థిని సన్మానించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్, ప్రధానోపాధ్యాయులు నాగభూషణ్, చిన్నారావు, ప్రభాకర్, మోదకొండ,మత్స్యరాజు,రవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై అల్లినగరం సమీపంలో గురువారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ గొర్లె వెంకునాయుడు (37) దుర్మరణం చెందారు. విశాఖ వైపు వెళుతున్న యాసిడ్ ట్యాంకర్, ముందు వెళుతున్న లారీని ఢీ కొట్టడంతో ట్యాంకర్ క్యాబిన్, ముందు ఇంజిన్ భాగం నుజ్జునుజ్జయ్యాయి. దీంతో ఇనుప ముక్కలు శరీరంలోకి చొచ్చుకునిపోయి డ్రైవర్ మృతి చెందగా.. డ్రైవర్ సీటు వెనక ఉన్న క్లీనర్ మాత్రం సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను బయటకు తీసే సమయానికే అతను మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతునిది అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం దోసూరు పంచాయతీ. ఎచ్చెర్ల ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి వేతనం రూ.257 తప్పనిసరి

- జాబ్ కార్డుదారుడి కుటుంబానికి 100 రోజులు..
- ఆర్వోఎఫ్‌ఆర్ రైతులకు రూ.150 రోజుల ఉపాధి
- డ్వామా పీడీ రమేష్ రామన్

పెదబయలు: జిల్లాలో ఉపాధి కూలీలకు ప్రతిరోజూ రూ.257 వేతనం తగ్గకుండా పని కల్పించాలని డ్వామా పీడీ రమేష్ రామన్ ఆదేశించారు. గురువారం మండలంలోని గలగండ, అరడకోట, గంపరాయి పంచాయతీల పరిధిలోని చుట్టుమెట్ట గ్రామాల్లో ఉపాధి పథకంలో టెర్రాసింగ్ పనులను ఆయన పరిశీలించారు. ప్రతీ రోజు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా రెండు పూటల హాజరు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 100 రోజులు, ఆర్వోఎఫ్ ఆర్ పట్టా కలిగిన వారికి 150 రోజుల పని కల్పించాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ ఏడాది చేపట్టిన ప్లాంటేషన్ పనులను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో గుర్తించిన పనులను ప్రాధాన్యత ఆధారంగా చేపట్టాలని ఆయన సూచించారు. ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులకు కూడా ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఉపాధి హామీ సిబ్బంది ప్రతీ రోజు పనులకు సంబంధించిన మస్తర్లు అప్‌లోడ్ చేయాలని, ఉపాధి పనులు జరిగే ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమానికి ఉపాధి ఏపీవో మూర్తి, ఈసీ సింహాచలం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


గలగండ ప్రాంతంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రమేష్ రామన్

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- సరంపేట పాఠశాల వద్ద పనులకు భూమిపూజ

అడ్డతీగల: నాడు-నేడు పథకంతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగలపల్లి ధనలక్ష్మి తెలిపారు. అడ్డతీగల మండలం సరంపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు నాడు-నేడు పథకం కింద రూ.12 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే ధనలక్ష్మి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నిధులతో మరుగుదొడ్లు, వంటషెడ్డు నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. పాఠశాలల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డపాటి రాఘవ,జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు,తహసీల్దార్ శ్రీనివాస్,గొండోలు,బొడ్లంక సర్పంచ్‌లు నాగులపల్లి రాఘవ,బోనెం రాఘవ తదితరులు పాల్గొన్నారు.


నాడు-నేడు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వంతెనల నిర్మాణానికి చర్యలు

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: నియోజకవర్గంలో అవసరమైన చోట వంతెన నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. హుద్‌హుద్ తుపాన్ సమయంలో కొట్టుకుపోయిన లోగేలి బ్రిడ్జిన నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీటీసీ జెమ్మ మాట్లాడుతూ ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న వంతెన సమస్య ఎమ్మెల్యే చొరవతో పరిష్కారమైందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ, వైస్ ఎంపీపీ లలిత, స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గోపాల్, మహిళా అధ్యక్షురావు శాంతి, సర్పంచ్ సునీత,ఎంపీటీసీలు వరహాలమ్మ,విజయ, వంతల జెమ్మ,ఉప సర్పంచ్ మహాదేవ్, సీనియర్ నాయకులు బాక సింహాచలం ,మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు ,మాజీ ఎంపీటీసీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


లోగేలి వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ